క్లుప్తంగా

సీహెచ్‌సీలో అన్నదానం


రోగులకు అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్ రెడ్డి, నాగమునేంద్ర రాజు ఆధ్వర్యంలో సోమవారం గర్భిణులు, రోగులు, వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైద్యులు సాగరిక, చరణ్ రాజు, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు సాంబశివారెడ్డి, వలిబాషా, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేద్దాం


కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ కార్మికులు, చిరువ్యాపారులు

డోన్ రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక,రైతు వ్యతిరేక విధానాలపై మంగళవారం నంద్యాలలో నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ డోన్ నియోజకవర్గ కార్యదర్శి అబ్బాస్, మోటారాముడు కోరారు. సోమవారం డోన్ పాతబస్టాండ్‌లో చిరు వ్యాపారులతో కలిసి ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. రైతుల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దారుణంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో నారాయణ, సూర్యప్రతాప్, రామ్మోహన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

వన భోజనాల కార్యక్రమంతో ఐక్యత


ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్: కార్తీక వన భోజనాల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంతో ఐక్యతారాగం వెల్లి విరిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్ అన్నారు. సోమవారం స్థానిక కోర్టు ఆవరణలో కార్తీక వన భోజన మహోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కోర్టు ఆవరణలో ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో కలిసి కార్తీక భోజనాలు చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత


లబ్ధిదారులతో ఎమ్మెల్యే కోట్ల

డోన్ టౌన్: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో 12 మందికి రూ.25 లక్షలు విలువైన చెక్కులను అందజేశారు.

నాటు సారా విక్రేత అరెస్టు


స్వాధీనం చేసుకున్న సారాతో సీఐ

డోన్ రూరల్: సారా విక్రయిస్తున్న బేతంచెర్ల మండలం గూటుపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి బాలరాజును అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి అన్నారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో సోమవారం వివరాలను వెల్లడించారు. గ్రామంలో సారా విక్రయిస్తున్న సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సీఐతో పాటు ఎస్‌ఐ దౌలత్‌ఖాన్, కానిస్టేబుల్స్ లక్ష్మీనారాయణ సుధాకర్‌రెడ్డి, రంగస్వామి తదితరులు ఉన్నారు.

బెల్లం ఊట ధ్వంసం


సారా బట్టీలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

అవుకు: మండల పరిధిలోని కొండమనాయునిపల్లె, పిక్కళ్లపల్లి తండాల్లో సారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్, ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. నాలుగు సారా తయారీ బట్టీలను ధ్వంసం చేసి 5,700 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వర్ధనాదేవి తెలిపారు. అలాగే 40 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఇన్‌స్పెక్టర్లు సుభాషిణి, లక్ష్మణదాసు, ఎస్‌ఐలు కమలాకర్, రమేష్ బాబు, ప్రవీణ్ పాల్గొన్నారు.

శైవక్షేత్రాల్లో కార్తీక సందడి


కొలిమిగుండ్ల: మల్లేశ్వరస్వామి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు


ప్యాపిలి: దీపాలతో శివలింగ ఆకృతి

- కడ సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

బనగానపల్లె రూరల్: కార్తీక మాసం కడ సోమవారం సందర్భంగా నియోజకవర్గంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వెలిగించారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయం, పసుపల గుండం మల్లికార్జునస్వామి ఆలయాలకు భక్తులు బారులు తీరారు. యాగంటి ఆలయ ఈఓ చంద్రుడు ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, కుంకుమార్చన, సహస్ర నామావళి, మహానివేదన తదతర పూజలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా ఆలయ కోనేరులో స్నానాలు చేసి, ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించారు. స్వామివారితో పాటు నందీశ్వరుడు, వేంకటేశ్వరస్వామి గుహ, వీరబ్రహ్మేంద్రస్వామి గుహలను సందర్శించి పూజలు చేశారు. నెల్లూరుకు చెందిన కళాకారులతో కోలాటం, సాయంత్రం శ్రీకృష్ణ ఈవెంట్స్ వారిచే ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమం, పౌరాణిక నాటకం భక్తులకు ఆకట్టుకుంది. పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని ఉమామహేశ్వరమ్మ దంపతుల ఆధ్వర్యంలో ఆర్యవైశ్య నిత్యాన్నదాన సంస్థ, వీరశైవలింగాయత్, రైతు అన్నదాన సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది.

మాజీ ఎమ్మెల్యే కాటసాని అన్నదానం

యాగంటి సమీపంలోని బసవన్న గోశాల వద్ద బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని నాగార్జునరెడ్డి జ్ఞాపకార్థం అన్నదానం చేశారు. ముందుగా తన సతీమణి కాటసాని జయమ్మతో కలిసి గోశాలలోని గోవులకు పూజలు చేశారు. నాగార్జునరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బండి బ్రహ్మానందరెడ్డి, గడ్డం వెంకటేశ్వరరెడ్డి, శివప్రసాదరెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బేతంచెర్ల: ముచ్చట్ల మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తుల సందడి

కిక్కిరిసిన ముచ్చట్ల మల్లికార్జునస్వామి ఆలయం

బేతంచెర్ల: హెచ్‌కొట్టాల గ్రామ సమీపంలోని ముచ్చట్ల భ్రమరాంబ, మల్లికార్జునస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆయా గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే యంబాయి గ్రామంలోని రామలింగేశ్వరుడు, బైనపల్లె, ముసలాయిచెర్వు, రహిమానుపురం గ్రామాల్లోని విశ్వేరస్వామి, సిమెంట్‌నగర్‌లోని బుగ్గ లింగేశ్వరస్వామి, గోర్లగుట్ట బుగ్గ రామేశ్వరస్వామి, దుర్గాపేట సిద్ధేశ్వరస్వామి ఆలయంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి స్వామివారికి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

నేల బెలుం.. నయనానందం

కొలిమిగుండ్ల: బందార్లపల్లె సమీపంలోని నేల బెలుం మల్లేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కడ సోమవారం నిర్వహించిన తిరుణాలకు వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. పాణిమట్టంపై సాలగ్రామం రూపంలో కొలువైన స్వామిని పూలతో అందంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఆలయానికి ఎదురుగా ఉన్న బిలంలోని నీటిలో స్నానం చేసేందుకు భక్తులు క్యూలైన్‌లో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. ఆలయం ముందు భాగంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. భక్తుల సౌకర్యార్థం తాడిపత్రి ఆర్టీసీ డిపో నుంచి బస్సు సర్వీసులు ఏర్పాటు చేశారు.


బేతంచెర్ల: భక్తులకు అన్నదానం

నయనాలప్ప క్షేత్రంలో భక్తుల సందడి

సంజామల: మండల పరిధిలోని నయనాలప్ప క్షేత్రం భక్తజనసంద్రంగా మారింది. ఆలయ కార్యనిర్వాహణ అధికారి చంద్రుడు, అర్చకులు గణేష్ శాస్త్రీ ఓంకారేశ్వరునికి పూజలు నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. భక్తులకు అన్నసత్రాల్లో అన్నదానం చేశారు. ఎడ్ల పోటీలు నిర్వహించారు.

కార్తీక పూజలు

ప్యాపిలి: స్థానిక నీలకంఠేశ్వరస్వామి, ఈశ్వర రామలింగేశ్వరస్వామి ఆలయంతో పాటు మెట్టుపల్లి సమీపంలోని కాకనవరం రామలింగేశ్వర స్వామి ఆలయం, పెద్దపొదిళ్లలో రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రియదర్శిని పాఠశాల విద్యార్థులు కార్తీమ మాస చివరి సోమవారం సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో శివలింగాకృతిని ఏర్పాటు చేశారు. రంగు రంగుల పూలు, దీపాలతో ఏర్పాటు చేసిన శివలింగాకృతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కిటకిటలాడిన శైవక్షేత్రాలు

అవుకు: మండల కేంద్రంలోని కాశీవిశ్వనాథస్వామి ఆలయం, బలరామేశ్వరస్వామి ఆలయాల్లో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.


కొలిమిగుండ్ల: ప్రత్యేక అలంకరణలో మల్లేశ్వరస్వామి


యాగంటి ఆలయ ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు


యాగంటి క్షేత్రంలో సాంస్కృతిక కార్యక్రమాలు


భక్తులకు అన్నదానం చేస్తున్న కాటసాని రామిరెడ్డి దంపతులు


మల్లేశ్వరుని తిరుణాలకు తరలివచ్చిన భక్తులు


సంజామల: ఓంకారేశ్వరుని చెంతకు వెళ్తున్న భక్తులు


అవుకు: పూజలందుకుంటున్న కాశీవిశ్వనాథస్వామి

గడువు ముగిస్తే ప్రమాదమే

కొలిమిగుండ్ల: గ్యాస్ సిలిండర్ల వినియోగం పెరిగింది. గతంలో కొద్ది మంది మాత్రమే గ్యాస్ వినియోగించేవారు. కాలక్రమేణా మార్పులు చోటు చేసుకోవడంతో ప్రతి ఇంట్లో వంట గ్యాస్ ఉపయోగిస్తున్నారు. హోటళ్లు, టీస్టాళ్ల చిరువ్యాపారులు సైతం గ్యాస్ ఉపయోగిస్తున్నారు. గ్యాస్ సిలిండర్‌తో తక్కువ సమయంలో వంట చేసుకోవడం సులభమైనా జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదం పొంచి ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాలపరిమితి ముగిసిన సిలిండర్‌ను వాడితే గ్యాస్ లీక్ అయ్యే ప్రమాదముంది. వంట గ్యాస్ కంపెనీలు అందించే సిలిండర్‌పై గడువు తేదీ, కోడ్‌ను మెటల్ ప్లేట్‌పై ముద్రించి ఉంటారు. సిలిండర్‌ను మార్చుకున్నప్పుడల్లా తేదీని చెక్ చేసుకోవాలి.


గ్యాస్ సిలిండర్లు

ఈ విధంగా గుర్తించాలి

సిలిండర్ మెటల్ ప్లేట్‌పై ఉదాహరణకు ఏ–24,బీ–24 ఉంటే ఆ సిలిండర్ 2024 మార్చి–జూన్‌కి గడువు ముగుస్తుందని అర్థం. 24 అంటే త్రైమాసికానికి గుర్తు. ఏ అక్షరం జనవరి నుంచి మార్చి వరకు, బీ అక్షరం ఏప్రిల్ నుంచి జూన్ వరకు, సీ అక్షరం జూలై నుంచి సెప్టెంబర్ వరకు, డీ అక్షరం అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు అని గుర్తించుకోవాలి. డెలివరీ బాయ్స్ సిలిండర్‌ను ఇంటి వద్దకు తీసుకురాగానే మెటల్ ప్లేట్‌పై కోడ్ రూపంలో ఉన్న తేదీని గమనించాలి. గడువు తేదీ, నెల వ్యవధిలో ముగుస్తున్నట్లు సిలిండర్‌పై ఉంటే ఆ సిలిండర్‌ను ఉపయోగించకూడదు.

వినియోగదారుల హక్కులు

గ్యాస్ సిలిండర్‌లు ఉపయోగించే వినియోగదారులకు హక్కులు ఉన్నాయి. సిలిండర్ బుక్ చేసుకున్నాం, ఇంటికి వచ్చిందని వాడితే ఇబ్బందులు తప్పవు. గ్యాస్ కనెక్షన్ ఉన్న వినియోగదారులు మృతి చెందితే వారి కుటుంబ సభ్యుల పేరిట మార్పు చేసుకునే వెసులుబాటు ఉంది. కొత్త కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే నిబంధనల ప్రకారం ధ్రువీకరణ పత్రాలు అందిస్తే త్వరగా కనెక్షన్ పొందవచ్చు. కనెక్షన్ తీసుకునే సమయంలో ఏజెన్సీల వద్ద స్టవ్ తీసుకోవాలన్న నిబంధన లేదు. గ్యాస్ ఏజెన్సీ నుంచి 5 కి.మీ వరకు వినియోగదారులకు సిలిండర్‌ను డోర్ డెలివరీ చేయాల్సి ఉంటుంది.

పేకాట రాయుళ్ల అరెస్టు?

డోన్ రూరల్: మండల పరిధిలోని ఓబులాపురం గ్రామంలో పోకాట ఆడుతున్న నలుగురిని సోమవారం డోన్ రూరల్ పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిసింది. ఇందులో ఇద్దరు నిర్వాహకులు పారిపోయినట్లు సమాచారం. అయితే ఎవరినీ అరెస్టు చేయలేదని రూరల్ సీఐ రాకేష్ చెప్పడం గమనార్హం.

వైభవంగా అయ్యప్పస్వామి దీపోత్సవం


అయ్యప్పస్వామి గ్రామోత్సవం


భక్తి గీతాలకు నృత్యం చేస్తున్న అయ్యప్ప భక్తులు

బనగానపల్లె రూరల్: స్థానిక బేతంచర్ల రహదారిలోని అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి దీపోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, పుష్పాభిషేకం తదితర పూజలు జరిగాయి. 11 గంటలకు స్వామివారికి తులాభారం జరిగింది. సాయంత్రం ఆలయం నుంచి అయ్యప్పస్వామి విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో కొలువుంచారు. పెట్రోల్‌బంకు, ఆస్థానం రోడ్డు, కూరగాయాల మార్కెట్, ఆంజనేయస్వామి ఆలయం మీదుగా అయ్యప్పస్వామి దేవాలయం వరకు ఊరేగింపు సాగింది. అనంతరం పడిపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వాములను సన్మానించారు. అనంతపురం జిల్లా పామిడి మండలానికి చెందిన వెంకిమామ కోలాట బృందంతో ఏర్పాటు చేసిన కోలాటాలు ఆకట్టుకుంది. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సోదరుడు కాటసాని ప్రసాదరెడ్డి సహకారంతో స్వాములకు భిక్ష, కాటసాని తిరుపాలరెడ్డి సహకారంతో రాత్రి అల్పాహారం ఏర్పాటు చేశారు.

ఇంటి స్థలాల మంజూరుకు వినతి

డోన్ టౌన్: అర్హత ఉన్న న్యాయవాదులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని పలువురు న్యాయవాదులు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా సీనియర్ న్యాయవాది రామలింగయ్య ఎంపికకు సహరించిన ఎమ్మెల్యే కోట్లను సోమవారం న్యాయవాదులు ఆయన స్వగృహంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాదులు పుల్లయ్య, రవిమోహన్, నారాయణ, భాస్కర్‌నాయుడు, వెంకటేష్, ఎస్టీ హరూన్, ప్రసాద్ ఉన్నారు.

యురేనియం తవ్వకాలతో తీరని నష్టం


మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ప్యాపిలి: యురేనియం తవ్వకాల కారణంగా ఆ పరిసర గ్రామాల ప్రజలకు తీరని నష్టం వాటిల్లుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, సుంకయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని మామిళ్లపల్లి, జక్కసానికుంట్ల, రాంపురం గ్రామాల్లో సీపీఐ నాయకులు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. పచ్చని గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం యురేనియం తవ్వకాల కోసం టెండర్లను ఆహ్వానించడం దారుణం అన్నారు. యురేనియం తవ్వకాలు చేపడితే ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. పంట పొలాలు బీడు భూములుగా మారిపోతాయన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించి గ్రామాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు వాసు, నాయకులు వెంకటేశ్, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

వసతి గృహంలో నీటి కష్టాలు


పనిచేయని మినరల్ వాటర్ ప్లాంట్

బనగానపల్లె రూరల్: స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలో ఏర్పాటు చేసిన మినరల్‌వాటర్ ప్లాంట్ పనిచేయకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులకు గురికావడంతో తాగునీటికి అవస్థలు తప్పడం లేదు. దీంతో బోరు నీటినే తాగుతున్నారు. ఈ వసతి గృహంలో 5 నుంచి 10వ తరగతి చదువుతున్న సుమారు 170 మంది విద్యార్థినులు ఉన్నారు. మరమ్మతులు చేయించాలని హాస్టల్ సిబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి విద్యార్థినులకు శుద్ధ జలం అందించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

కోవెలకుంట్ల: వివిధ పంటల్లో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. సోమవారం హైదరాబాద్‌కు చెందిన మల్లారెడ్డి విశ్వవిద్యాలయ విద్యార్థులు మండలంలోని వెలగటూరు గ్రామ రైతులకు పలు సూచనలు తెలియజేశారు. మిరప పంటలో బంక అట్టల ఏర్పాటు, వాటి ఆవశ్యకత, రసం పీల్చు పురుగుల ఉధృతిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలిచ్చారు. మిరప, మినుము పంటల్లో త్రిప్స్, పేను బంక, తదితర చీడపీడల నివారణ పద్ధతులను వివరించారు. విద్యార్థులు శివప్రసాద్, సిద్ధార్థ, సాయినాథ్, వెన్నెత్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

- మొదటి స్థానంలో ఎస్.కొత్తూరు వృషభాలు


రాతిదూలాన్ని లాగుతున్న వృషభాలు

బనగానపల్లె రూరల్: కార్తీక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని పసుపల గ్రామంలోని గుండం మల్లికార్జునస్వామి ఆలయ ఆవరణలో వృషభాల రాతిదూలం పోటీలు హోరాహోరీగా జరిగాయి. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ సహకారంతో అంతర్రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. మొత్తం 9 జతల ఎడ్లు పాల్గొన్నాయి. మొదటి స్థానంలో నంద్యాల జిల్లా ఎస్.కొత్తూరు గ్రామానికి చెందిన బీరంబుల్స్, బీరం సుబ్రమణ్యేస్వరరెడ్డి వృషభాలు నిలిచాయి. రెండో బహుమతిని నాగర్ కర్నూలు జిల్లా రాయవరం గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి, మూడో బహుమతి నంద్యాల జిల్లా పిన్నాపురం వెంకటసుబ్బయ్యయాదవ్ వృషభాలు కైవసం చేసుకున్నాయి. నాల్గో బహుమతి గద్వాల్ జిల్లా ఉత్తనూర్ గ్రామానికి చెందిన యశ్వంత్‌యాదవ్, నరేష్ వృషభాలు, ఐదో బహుమతి నంద్యాల జిల్లా బిల్లలాపురం గ్రామం గోవర్ధన్‌రెడ్డి ఎడ్లు దక్కించుకున్నాయి. విజేతలకు దాతల సహకారంతో వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20వేలు.రూ.10 వేలు యజమానులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఆకుల సిద్దేశ్వరప్ప, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

29న జాబ్‌మేళా

నందికొట్కూరు: ఈ నెల 29న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, కేఎల్ గ్రూప్, త్రీ క్వీస్ కార్పొరేషన్‌కు చెందిన ప్రతినిధులు వస్తున్నారన్నారు. పది, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని చెప్పారు. 91548 30286 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
డోన్, బనగానపల్లె
90100 55532 (డోన్)
99122 20581 (బనగానపల్లె)
Office mail : sakshiknladvt@gmail.com